పంచాయతీరాజ్ ఏఈలతో ఎమ్మెల్యే సమావేశం

బెల్లంపల్లి, ఆగస్టు 16 : బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ ఏఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల పంచాయతీరాజ్ ఏఈలతో విస్తృతంగా చర్చించారు. గ్రామాల్లో చెడిపోయిన, మరమ్మతులు చేయాల్సిన, నూతనంగా నిర్మించే రోడ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. వెంటనే అందుకు సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు.

కోటపల్లి, ఆగస్టు 16 : కోటపల్లి మండలం పారుపల్లి సమీపంలోని భైరవ కోనపై భైరవుడికి ఎమ్మెల్యే వినోద్ పూజలు నిర్వహించారు. నాయకులు రుద్రబట్ల సంతోష్, గాలిమధు, సాబీర్ అలీ, నామని లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 16 : మంచిర్యాల పట్టణంలోని తన నివాసం వద్ద శుక్రవారం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆపదలో ఉన్నవారికి సీఎం సహాయనిధి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దండేపల్లి, ఆగస్టు 16 : దండేపల్లి మండలం మేదరిపేటలో 240 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ కోట్నాక తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేంచంద్, మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ గడ్డం నాగారాణి– త్రిమూర్తి, తహసీల్దార్ సంధ్యారాణి ఉన్నారు.

హాజీపూర్, ఆగస్టు 16 : హాజీపూర్ తహసీల్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని మహిళలకు రైస్‌మిల్లు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాస్ రావ్ దేశ్‌పాండే, డిప్యూటీ తహసీల్దార్ హరిత, ఆర్ఐ మంగ, మండలాధ్యక్షుడు తోట రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు సత్తయ్య, వైస్ చైర్మన్ రాసమల్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఏఈవోల బదిలీలు

హాజీపూర్, ఆగస్టు 16 : మండల వ్యవసాయ విస్తరణ (ఏఈవో) అధికారులను బదిలీ చేస్తూ వ్యవసాయ శాఖ కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో మండలంలోని దొనబండ క్లస్టర్ కర్నమామిడి రైతు వేదికలో విధులు నిర్వహిస్తున్న ఎస్ కనుకరాజును మందమర్రి మండలం రామకృష్ణాపూర్ బొక్కలగుట్ట క్లస్టర్‌కు.., జైపూర్ మండలంలో విధులు నిర్వహిస్తున్న ఎస్ కొమురయ్యను దొనబండ.., హాజీపూర్ క్లస్టర్‌లోని గుడిపేటలో విధులు నిర్వహిస్తున్న శ్రీనిఖను లక్షెట్టిపేటకు, లక్షెట్టిపేట క్లస్టర్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రసన్నను గుడిపేట రైతు వేదికకు బదిలీ చేశారు. ఉద్యోగులు తక్షణమే విధుల్లో చేరాలని ఆదేశించారు.

ప్రమాద స్థలం సందర్శన

హాజీపూర్, ఆగస్టు 16 : హాజీపూర్ మండల కేంద్రంలో 14వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని రోడ్డు భద్రతా కమిటీ శుక్రవారం సందర్శించింది. బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో చిప్పకుర్తి పోశమ్మ(68) మృతి చెందింది. కేసు నమోదు కావడంతో రోడ్డు భద్రతా కమిటీలో సభ్యులైన మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, ఎంవీఐ కిషోర్‌చంద్ర రెడ్డి, హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ ప్రమాదస్థలాన్ని సందర్శించి, స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్నారు. ప్రమాదాల నివారణలో భాగస్వామ్యం కావాలని సూచించారు. మండలంలోని పలు ప్రమాదాలు జరిగే జాతీయ రహదారి ప్రాంతాలను సైతం త్వరలోనే పూర్తిస్థాయిలో పర్యవేక్షించి, ప్రమాదాల విచారణకు అవసరమైన చర్యలు తీసుకునేలా చూస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

కాసిపేట పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీ

కాసిపేట, ఆగస్టు 16 : కాసిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు, ప్రసవాలు, డ్రై డే కార్యక్రమాలపై ఆరా తీశారు. వైద్య సేవలను అక్కడ వైద్య సేవలు పొందుతున్న వారిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. 100 శాతం స్పష్టమైన రిజిస్టర్లను నిర్వహణ చేస్తూ ఆరోగ్య పరిమితులను మెరుగుపర్చాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్, సిబ్బంది డీఎంహెచ్‌వోకు శాలువాతో సన్మానించారు. డీపీడీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, వైద్యాధికారి రవి కిరణ్, డీఈఎంవో వెంకటేశ్వర్లు, హెచ్ఈవో చంద్ర శేఖర్, ల్యాబ్ టెక్నీషియన్ గోపి, ఫార్మాసిస్ట్ అబ్దుల్ భారీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి

మంచిర్యాల (ఏసీసీ), ఆగస్టు 16 : కామారెడ్డి డిక్లరేషన్ పేరిట బీసీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీసీ జేఏసీ నాయకుడు వడ్డేపల్లి మనోహర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ జనగణన చేపట్టి, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కేటాయించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. జనగణన చేయకుండా, స్థానిక ఎన్నికలకు ముందుకుపోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. బీసీ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు కార్యాచరణను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు త్వరలోనే బీసీ భవన్‌లో కీలకమైన బీసీ నాయకులతో చర్చలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గుమ్ముల శ్రీనివాస్, చుంచు రాజకిరణ్, తుల మధుసూదన్ రావు, శ్రీరామోజీ కొండయ్య, కనుకుంట్ల మల్లయ్య తదితరులు హాజరయ్యారు.

మహా పాదయాత్రకు స్వాగతం

కాసిపేట, ఆగస్టు 16 : తిర్యాణి మండల అభివృద్ధి కోసం మహాత్మా గాంధీ వేషధారణతో హైదరాబాద్‌లోని ప్రజాభవన్, సీఎం క్యాంప్ కార్యాలయానికి బయల్దేరిన ఆదివాసీ ఉద్యమ నాయకుడు ధర్ము చేపట్టిన మహా పాదయాత్ర శనివారం సోమగూడెం చేరుకున్నది. స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోనెల శ్రీనివాస్, గుమాస భీమయ్య, అచ్యుత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి, ఆగస్టు 16 : బెల్లంపల్లిలో ఆదివాసీ ఉద్యమ నాయకుడు ధర్ముకు స్థానిక నాయకులు స్వాగతం పలికారు. ధర్ము మాట్లాడుతూ.. తిర్యాణి నుంచి త్రీ ఇంక్లైన్ వరకు డబుల్ రోడ్డు నిర్మించాలని, ఎన్టీఆర్ సాగర్ ప్రాజెక్ట్ కాలువలను ఆధునీకరించి ఆరు వేల ఎకరాలకు సాగునీరందించాలని కోరారు. పది పన్నెండు రోజుల్లో హైదరాబాద్ చేరుకొని సీఎం రేంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించడంతో పాటు, సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు తిర్యాణి మండలానికి రావాలని ఆహ్వానించనున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణంపై విచారణ ప్రారంభం

సిర్పూర్(టీ), ఆగస్టు 16 : సిర్పూర్(టీ) మండల కేంద్రం డౌనల్ ప్రాంతంలోని మోయిబ్ దుకాణం నుంచి తారా ఇంటి వరకు రూ.1.88 లక్షలతో సీసీ రోడ్డు వేయకుండానే నిధులు కాజేశారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేసిన ఆరోపణలపై పంచాయతీ రాజ్ శాఖ అధికారులు శుక్రవారం విచారణ ప్రారంభించారు. పీఆర్ డీఈ రామ్మోహన్, పీఆర్ ఏఈ ఆత్మారామ్ డౌనల్ ప్రాంతంలోని సీసీ రోడ్డును పరిశీలించారు. కోలతలు చేసి, రికార్డులను నమోదు చేసుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలపై విచారణ చేస్తున్నామని, వివరాలు త్వరలో వెల్లడిస్తామని డీఈ రామ్మోహన్ తెలిపారు.

కొల్లూరులో వైద్యశిబిరం

కోటపల్లి, ఆగస్టు 16 : కోటపల్లి మండలం కొల్లూరులో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్ పబ్బ సుధాకర్ గౌడ్, కార్యదర్శి వెన్నపురెడ్డి సుధాకర్ రెడ్డి, ఏఎన్ఎం పుష్ప ఆధ్వర్యంలో గ్రామస్తులకు పరీక్షలు చేశారు. జ్వరం ఉన్నవారి నుంచి రక్త నమూనాలను సేకరించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించారు.

వర్షపు నీటితో ఇక్కట్లు

తాండూర్, ఆగస్టు 16 : తాండూర్ మండల కేంద్రంలో శుక్రవారం కురిసిన వర్షానికి రోడ్లపై, ఇండ్లలోకి వర్షపు నీరు చేరింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీరు నిలిచి ఉండడంతో అవస్థలకు గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. కాలనీలో చాలా చోట్ల డ్రైనేజీలు లేకపోవడం, ఉన్నచోట్ల నిర్వహణ వ్యవస్థ సరిగాలేక ఇండ్లలోకి వచ్చి ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్
- దవాఖానల్లో తనిఖీ

తాండూర్, ఆగస్టు 16 : ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది విధులపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ హెచ్చరించారు. తాండూర్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, పీహెచ్‌సీ, గ్రామపంచాయతీలను శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాండూర్ గ్రామ పరిధిలోని పీహెచ్‌సీని తనిఖీ చేయగా, వైద్యురాలు లేకపోవడం, చికిత్సకోసం వచ్చిన రోగులు వేచి ఉండడాన్ని గమనించిన కలెక్టర్, ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులను పరీక్షించే సమయంలో వైద్యులు అందుబాటులో ఉండకపోవడం సరికాదన్నారు. వైద్యులు లేకపోడంపై డీఈవోకు సమాచారం అందించి, చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం తాండూర్ గ్రామపంచాయతీకి వెళ్లి హరిత హారం నర్సరీని పరిశీలించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొక్కల లెక్కలు తెలుపకపోవడంతో పంచాయతీ కార్యదర్శి దివాకర్‌ను మందలించారు. శానిటేషన్ సక్రమంగా నిర్వహించి, సీజనల్ వ్యాధులు ప్రభలకుండా చూసుకోవాలన్నారు. అనంతరం అచ్చలాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలను తనిఖీ చేసి, అమ్మఆదర్శ పాఠశాల పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యాచరణ ప్రకారం విద్యార్థులకు విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. తాండూర్ కేజీబీవీలో తనిఖీ చేసి, మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎస్వో సుమన చైతన్యకు సూచించారు. మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలను తనిఖీ చేశారు. వసతులు సరిగా లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా భవనం కేటాయింపు విషయమై మాదారం టౌన్‌షిప్‌లోని సింగరేణి పాఠశాల గదులను పరిశీలించారు. అవి కూడా సరిగా లేకపోవడంతో పాఠశాల తరలింపు విషయాన్ని నిరాకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో పీ శ్రీనివాస్ ఉన్నారు.

తాండూర్ పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి దవాఖాన సందర్శన..

బెల్లంపల్లి, ఆగస్టు 16 : బెల్లంపల్లి వంద పడకల దవాఖానను కలెక్టర్ కుమార్ దీపక్ ఆకస్మికంగా సందర్శించారు. దవాఖాన ఆవరణ, వార్డులు, ఫార్మసీ, రిజిస్టర్లను పరిశీలించారు. దవాఖానలో అందుతున్న సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. మెరుగైన వైద్యంతో పాటు, వారి ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల శుభ్రత అవశ్యకతను ప్రజలకు వివరించాలని తెలిపారు. వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని, దోమల వృద్ధిని నియంత్రించేందుకు తీసుకోవాల్సిన చర్యలను సమగ్రంగా వివరించాలని చెప్పారు.

దండేపల్లి : గూడెంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మంచిర్యాల అర్బన్ : విశ్వనాథ ఆలయంలో కలెక్టర్ కుమార్ దీపక్ దంపతులు

తాండూర్ : సేవాజ్యోతిలో వరలక్ష్మీ వ్రత పూజలు చేస్తున్న నిర్వాహకులు

ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు

దండేపల్లి/మంచిర్యాల అర్బన్/కౌటాల/హాజీపూర్/ శ్రీరాంపూర్/బెల్లంపల్లి/తాండూర్/దహెగాం/చెన్నూర్‌టౌన్/, ఆగస్టు 16 : శ్రావణమాసం సందర్భంగా జిల్లాలో శుక్రవారం మహిళలు వరలక్ష్మి వ్రతాలు ఘనంగా ఆచరించారు. కుంకుమ పూజలు నిర్వహించారు. నిష్టతో వరలక్ష్మీ దేవిని అలంకరించి, పసుపు, కుంకుమలను వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో భక్తుల సందడి కనిపించింది. ఆలయంలో 90 జంటలు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ దంపతులు విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భట్టాచార్యులు, నరహరి శర్మ, బాలకృష్ణ శర్మ ప్రతేక పూజలు చేసి, తీర్థప్రసాదాలను అందజేశారు. వారి వెంట విశ్వనాథ ఆలయ కమిటీ కార్యనిర్వహణ అధికారి ముక్త రవి ఉన్నారు. కౌటాల మండల కేంద్రంలోని స్వయంబూ శ్రీ కంకలమ్మ కేతేశ్వర ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీరాంపూర్ కాలనీ విశ్వశాంతి హైస్కూల్‌లో కరస్పాండెంట్ జక్కెన రమేశ్ ఆధ్వర్యంలో వేద పండితులు విజయ్‌శర్మ మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులతో సామూహిక వరలక్ష్మి వ్రతం చేయించారు. బెల్లంపల్లిలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో 64 మంది మహిళలు వత్రంలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. మాతృభారతి సభ్యులు లలిత మారు, పల్లెర్ల సింధు, రాజేశ్వరి, కల్పన, సూరం లక్ష్మీనారాయణ, విభాగ్ అకాడమిక్ ఇన్‌చార్జి పూదరి సత్యనారాయణ, హెచ్ఎం ఇంగు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. తాండూర్ మండలం బోయపల్లిలో బుగ్గ రాజరాజేశ్వర దేవస్థానం చైర్ పర్సన్ మాసాడి శ్రీదేవి, తాండూర్ సేవాజ్యోతిలో గజ్జెల్లి శ్రీదేవి, మల్లేశ్, నిర్వాహకులు వరలక్ష్మి వ్రతాలు ఆచరించారు.

నాణ్యమైన వైద్యం అందించాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

సిర్పూర్(టీ), ఆగస్టు 16 : ప్రజలకు నాణ్యమైన వైద్యం, విద్యనందించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని సిర్పూర్(టీ) సామాజిక దవాఖాన, సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన దవాఖానలోని పరిసరాలను పరిశీలించి, రోగులతో మాట్లాడారు. దవాఖానకు వచ్చే రోగులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, దవాఖానలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, వైద్యం అందించాలని సూచించారు. పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, పౌష్టికాహారం అందించాలన్నారు. ఆయన వెంట జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, డీసీహెచ్‌వో చెన్నకేశవ, ఎంపీడీవో సత్యనారాయణ, వైద్యులు జోగేందర్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, కార్యదర్శి తిరుపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోగులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దిపక్ తీవారీ

అవినీతిని బయటకు తీస్తం

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిర్పూర్(టీ), ఆగస్టు 16 : సిర్పూర్(టీ) మేజర్ గ్రామ పంచాయతీలో జరిగిన అవినీతి, అక్రమాలను ఒక్కొక్కటిగా బయటకుతీస్తామని బీఆర్ఎస్ పార్టీ సిర్పూర్(టీ) మండల కన్వీనర్ అస్లా బిన్ అబ్దుల్ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. సిర్పూర్(టీ) జీపీలో జరిగిన అవినీతిపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నిస్తే, దానికి సమాధానం ఇవ్వకుండా ప్రజలను తప్పుదోవపట్టించే విషయాలు చెప్పి తప్పించుకున్నావని మాజీ సర్పంచ్ కీజర్ హుస్సేన్‌పై మండిపడ్డారు. మండల కేంద్రంలోని దుబ్బగూడ కాలనీలో మూడు సీసీ రోడ్ల పేరుతో రూ.4.50 లక్షలు, 2020 అక్టోబర్‌లో రూ.8.50 లక్షలు దురివనియోగమయ్యాయని ఆరోపించారు. అందుకు సంబంధించిన ఎంబీ రికార్డు, జీపీ తీర్మానం, ఎస్టిమేట్ కాపీలు ఎటుపోయాయని ప్రశ్నించారు. 2021లో బృహత్ పల్లె ప్రకృతి వనంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా ఒక్కో చెట్టుకు వచ్చిన నిధులతో పాటు, పర్చేస్ ఆఫ్ ట్రీస్ పేరుతో రూ.6.30 లక్షల బిల్లులు కాజేశావని, మళ్లీ అదే బృహత్ పల్లె ప్రకృతి వనం పేరుమీద ఇతర గ్రామాల సర్పంచ్‌లను బెదిరించి, నందిసీడ్స్ పేరుతో లక్షల రుపాయలను దోచుకున్నావని ఆరోపించారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను తిట్టే స్థాయి నీది కాదని, ఇంకోసారి అలాంటి వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మంగీలాల్, లలిత, రాజేశ్, పనాస లక్ష్మణ్, ఫహద్, వినోద్, షారూఖ్ ఉన్నారు.

కేజీబీవీలో డీఈవో సందర్శన

దండేపల్లి, ఆగస్టు 16 : దండేపల్లి కేజీబీవీని మంచిర్యాల డీఈవో యాదయ్య శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. పరిసరాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి, వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడారు. క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. భోజనం, బోధనపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ప్రత్యేకాధికారి మంజుల, ఉపాధ్యాయులున్నారు.

బ్యాంకుల్లో కనీస వసతులు కరువు

శ్రీరాంపూర్, ఆగస్టు 16 : నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని బ్యాంకుల్లో వినియోగదారులకు కనీస వసతులు, సౌకర్యాలు కల్పించడంలేదని పౌర సమాచార సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లింగం రాజయ్య ఆరోపించారు. బ్యాంకులను శుక్రవారం సందర్శించారు. వినియోగదారులకు యాజమాన్యాలు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలు పరిశీలించారు. ఈమ సంఘం ద్వారా బ్యాంకుల మేనేజర్లకు వినతి పత్రాలు అందించామని తెలిపారు.

పీఏసీఎస్‌లో బయటపడ్డ అక్రమాలు

- పలువురు రైతులు నిలదీయంతో వెలుగులోకి

కార్యాలయంలో విచారిస్తున్న అసిస్టెంట్ రిజిస్టర్ అనంతలక్ష్మి

రెబ్బెన, ఆగస్టు 16 : రెబ్బెన పీఏసీఎస్‌లో అవినీతి అక్రమాల నిర్వాకం రైతులను విస్తుపోయేలా చేసింది. సహకార బ్యాంకులో రైతులు, ఖాతాదారులకు తెలియకుండా, వారి ప్రమేయమే లేకుండా లక్షల్లో రుణాలు తీసుకున్నట్లు రుణమాఫీ జాబితాలో వెల్లడి కావటం చర్చనీయాంశమైంది గతంలో రుణాలు తీసుకొని తిరిగి చెల్లించి, నో డ్యూ సర్టిఫికెట్ తీసుకున్న వారికి సంబంధించిన వారిపేర్లు సహకార బ్యాంకులో రుణాలు ఉన్నట్లు చూపించడంతో సర్కారు అందిస్తున్న రుణమాఫీ పథకానికి దూరమై లబోదిబోమంటున్నారు. రుణాలు ఉన్నట్లు చూపిస్తున్న పలువురు రైతులు.. నాయకులను అశ్రయించడంతో శుక్రవారం సాయంత్రం పీఏసీఎస్ చేరుకొని సంబంధిత సీఈవో సంతోష్‌ను నిలదీశారు. సరైన సమాధానం రాకపోవడంతో మాజీ జడ్పీటీసీ వేముర్ల సంతోష్ ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా సమచారం అందించి, సమస్య పరిష్కరించాలని కోరారు. అసిస్టెంట్ రిజిస్టర్ అనంతలక్ష్మి కార్యాలయానికి చేరుకొని విచారణ చేపట్టారు. రుణమాఫీకి సంబంధించిన పత్రాలు లేకపోవడంతో శనివారం టీంగా వచ్చి, దర్యాప్తు జరిపి బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు ఫోన్‌లో హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ కార్యాలయానికి చేరుకొని విషయంపై అరా తీశారు.

ఉమ్మడి జిల్లా చెస్ పోటీలకు ఎంపిక

జన్నారం, అగస్టు 16 : ఆదిలాబాద్ జోనల్‌స్థాయి చెస్ పోటీలకు మండల కేంద్రంలోని స్లేట్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు చైర్మన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మందమర్రి పట్టణంలో 13వ తేదీన జరిగిన జిల్లాస్థాయి చెస్ పోటీల్లో అండర్–17 విభాగంలో జే ఇసాన్ (పదోతరగతి), అండర్–14 విభాగంలో సాహిత్, రన్వీర్ కృష్ణ ప్రతిభ చూపారని పేర్కొన్నారు. వీరిని డైరెక్టర్ ఏనుగ రజిత రెడ్డి, ప్రిన్సిపాల్ శిరిన్‌ఖాన్, మెర్లిన్, పీఈటీలు సంతోష్, నగేశ్, వినీత్, కృష్ణ, దిలీప్ అభినందించారు.

శరణాలయానికి విరాళం

తాండూర్, ఆగస్టు 16 : అనాథలు, అభాగ్యులను తమకు తోచిన విధంగా ఆదుకోవాలని బెల్లంపల్లి పట్టణంలోని రైల్వే ఉద్యోగులు పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సేవాజ్యోతి శరణాలయంలోని పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రూ.10వేలు విరాళంగా అందజేశారు. ఉద్యోగులు సాయి కుమార్, రమేశ్, సురేశ్, మీన, సేవాజ్యోతి వ్యవస్థాపక అధ్యక్షురాలు గజ్జెల్లి శ్రీదేవి మల్లేశ్ పాల్గొన్నారు.

హరీశ్‌రావును విమర్శించడం మానుకోవాలి

మాట్లాడుతున్న వైస్ చైర్మన్ కమ్మల విజయధర్మ

జన్నారం, అగస్టు 16 : మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావును సీఎం విమర్శించడం మానుకోవాలని చింతగూడ సింగిల్ విండో వైస్ చైర్మన్ కమ్మల విజయధర్మ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 15వ తేదీలోగా మూడోవిడుతలో రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తానని చెప్పి, చేయకపోడం, అర్హుల లిస్టును కూడా విడుదల చేయకపోవడం విడ్డూరంగాఉందన్నారు. పైగా అబద్ధపు మాటలు మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రైతన్నకు, మాజీ మంత్రి హరీశ్‌రరావుకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్, టౌన్ అధ్యక్షుడు బాలసాని శ్రీనివాస్‌గౌడ్ దాసరి శ్రీనివాస్, సుజన్ తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులను ఆదుకోవాలి

జన్నారం, అగస్టు 16 : వయోవృద్ధులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని తెలంగాణ గ్రామీణ వయోవృద్ధుల సంఘం అధ్యక్షుడు లెక్కల మల్లయ్య కోరారు. మండల కేంద్రంలోని వయోవృద్ధుల సంక్షేమ సంఘం కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. ఆసరా పింఛన్ రూ.4016 ఇవ్వాలని టీఎస్ ఆర్టీసీ బస్ చార్జీలో 50 శాతం రాయితీ కల్పించి, అన్ని రకాల జబ్బులకు ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానల్లో చికిత్స పొందేలా చూడాలని కోరారు. వ్యవస్థాపక అధ్యక్షుడు భాస్కర్‌రాజ్, అన్నెం కాంతమని, భూమాగౌడ్ పాల్గొన్నారు.

జేఎల్ఎంలకు ఉద్యోగోన్నతి

లక్షెట్టిపేట, ఆగస్టు 16 : లక్షెట్టిపేటలో పనిచేస్తున్న ఏడుగురు విద్యుత్ శాఖ జూనియర్ లైన్‌మన్లకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ శుక